క్లుప్తంగా

22 నుంచి ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చింతకొమ్మదిన్నె: మండలంలోని అన్ని గ్రామాలలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ఈ నెల 22వ తేదీ నుంచి ఇంటింటికి తిరిగి కూటమి వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని వైఎస్సార్‌సీపీ కమలాపురం ఆర్గనైజింగ్ కార్యదర్శి గుత్తి రెడ్డి శ్రీనివాసులురెడ్డి, చింతకొమ్మదిన్నె మండల కన్వీనర్ గూడా ప్రభాకరరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ నరేన్ రామాంజనేయులరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ మంగళవారం ఉదయం ఏడుగంటలకు చింతకొమ్మదిన్నె గ్రామంలో కార్యక్రమం ప్రారంభిస్తామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగం నాయకులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దోమల నివారణకు గంబూషియా చేపలు

చింతకొమ్మదిన్నె: చింతకొమ్మదిన్నె సమీపంలోని నీటి కుంటలో శనివారం గంబుషియా చేపలను వదిలారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సిబ్బంది లక్ష్మన్న, జనార్దన్, ఇంతియాజ్‌అహ్మద్, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణుల రాక

పులివెందుల: పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం మధ్యాహ్నం నుం,ఇ కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

మైలవరం: మండలంలోని రామచంద్రాయపల్లెలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నారు. గత కొంత కాలంలో గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తింది. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని స్థానికులు కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ట్యాంకరుతో నీరు సరఫరా చేస్తున్నారు.

వేతనాలు పెంచి ఆదుకోండి

వేంపల్లి: గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచి ఆదుకోవాలని కార్మికులు కోరారు. సర్పంచ్ రాచినేని శ్రీనివాసులును గ్రామ పంచాయతీ కార్మికులు శనివారం కలిసి తమ బాధలను చెప్పుకున్నారు. గత కొన్నేళ్లుగా అరకొర వేతనాలు ఇస్తుడడంతో కుటుంబ పోషణ భారమై పిల్లలను చదివించుకోలేకపోతున్నామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరారు. స్పందించిన సర్పంచ్ శ్రీనివాసులు అధికారులతో వేతనాలు పెంపుపై చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రాజెక్టు పూర్తిచేస్తే ఏపీ ఎడారే

వేంపల్లి: కృష్ణానది ఎగువన అక్రమంగా నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలు పూర్తయితే దిగువ రాష్ట్రమైన ఏపీ ఎడారిగా మారుతుందని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం రిజర్వాయర్‌లో 817.50 అడుగుల నుంచి ఏడాదికి 90 టీఎంసీలు ఎత్తిపోసే విధంగా పాలమూరు-రంగా రెడ్డి, 30టీఎంసీలు ఎత్తిపోసే విధంగా డిండి ఎత్తిపోతల ప్రాజెక్టును తెలంగాణ రాష్ట్రం నిర్మిస్తోందన్నారు. ఈ అక్రమ ప్రాజెక్టులకు బచావత్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ద్వారా నీటి కేటాయింపులు లేవన్నారు. కేంద్ర జలసంఘం, కృష్ణాబోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేదన్నారు. అయినా తెలంగాణా ప్రభుత్వం దౌర్జన్యంగా నిర్మిస్తోందని ఆరోపించారు.

22వ తేదీలోగా తెలియజేయాలి

వేంపల్లి: మండలంలోని అలవలపాడు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో పత్తి పంటకు బీమా వద్దనుకుంటే ఈనెల 22వ తేదీ లోపు అర్జీ పెట్టుకోవాలని ఆ బ్యాంక్ మేనేజర్ ఓ ప్రకటనలో తెలిపారు. బీమా కావాలనుకుంటే రైతులు తమ ఖాతా నుండి డబ్బులు తీసుకుని బ్యాంకు వారికి పంపాలన్నారు. వద్దనుకున్న వారు కార్యాలయాన్ని సంప్రదించి అర్జీ పెట్టుకోవాలని సూచించారు. 22వ తేదీ వరకూ అవకాశం ఉందని తెలిపారు. జూలై 15వ తేదీ దాకా బీమా చేసుకున్న వారే అర్హులన్నారు.

అవగాహన కలిగి వుండాలి

వల్లూరు: బాలికలు సమాజంపై అవగాహన కలిగి వుండాలని సీఐలు ఎస్కే రోషన్, జీ.ఈదురుబాషా అన్నారు. మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్, మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థినులకు నేరాలు, ప్రవర్తన, చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. మంచి స్పర్శ - చెడు స్పర్శ, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. శక్తి యాప్ వాడకం, దాని వలన లాభాల గురించి, టోల్ ఫ్రీ మహిళలు, బాలికల సహాయ హెల్ప్‌లైన్ నంబర్లు 112, 181, 1098, 1930 అంశాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పెద్ద ఓబన్న, అధ్యాపకురాలు దీప, హెడ్‌కానిస్టేబుల్ ప్రకాష్ , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అటకెక్కిన ఉచితం.. అన్నదాతపై భారం

ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. ప్రీమియం రైతులే భరించాలని ఉత్తర్వులు జారీ చేసింది. విత్తనాలు కొనేందుకు ఇంట్లో నగలు తాకట్టు పెట్టిన రైతన్నకు ఇది భారంగా మారుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో ప్రీమియం చెల్లిస్తే.. కూటమి ప్రభుత్వం రైతులే చెల్లించాలంటూ చెప్పడమేమిటంటూ అన్నదాతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రీమియం రైతులే చెల్లించేలా ఉత్తర్వులు జారీచెసిన కూటమి సర్కార్
- గత వైఎస్సార్‌సీపీ పాలనలో బీమా ప్రీమియం చెల్లించిన ప్రభుత్వం



కొట్టాలపల్లెలో చీనీ తోట

కొండాపురం: గత ఏడాది పత్తి, చీనీ, వరి, అరటి, పంటలు వేసి సరైన సమయంలో వర్షాలు లేక.. పంటలు పండక.. గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడ్డారు. ఇపుడు బీమా ప్రీమియం చెల్లింగా వారికి అదనపు భారంగా మారింది. విత్తనం కొనుగోళ్లకే డబ్బు లేక ఇంట్లో వస్తువలు తాకట్టు పెట్టుకోవాల్సిన పరిస్థితి రైతులది. ఈ నేపథ్యంలో ఏ ప్రోత్సాహం అందివ్వని కూటమి ప్రభుత్వం ఇపుడు ఉచిత పంటల బీమాను అటకెక్కించింది.

పదివేల హెక్టార్లల్లో సేద్యం

మండల వ్యాప్తంగా దాదాపు పది వేల హెక్టార్ల సేద్యపు భూములున్నాయి. ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, మినుము, సోయాబీన్, పత్తి, ఆముదం, కంది పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షం కురకపోవడంతో బోరు బావుల కింద సోయాబీన్, మొక్క జొన్న పంటలను అక్కడక్కడా అరకొరగా సాగు చేశారు. మరిన్ని ప్రాంతాల్లో చీనీ, అరటి, దానిమ్మ, మిర్చి, పలు ఉద్యాన పంటలు సాగు చేశారు.

రైతులపై అదనపు భారం

గత ఏడాది కాస్తో కూస్తో పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం ఈ ఏడాదైనా ఆదుకుంటుందని గంపెడాశతో ఉన్న రైతులపై ప్రీమియం భారం వేయడాన్ని అన్నదాతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రీమియం చెల్లిస్తేగానీ విపత్కర పరిస్థితులలో బీమా వర్తించదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్కో పంటకు ఒక్కో రకంగా ధర నిర్ణయించి రైతులే చెల్లించాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. వరికి ఎకరాకు రూ.84, పత్తికి ఎకరాకు రూ.2 వేలు, వేరుశనగకు ఎకరాకు రూ.560, చీనీకి ఎకరాకు రూ.2750, అరటి ఎకరాకు రూ.3025, ఉల్లికి ఎకరాకు రూ.90, మొక్కజొన్నకు రూ.66 చొప్పున ప్రీమియం కట్టాలని సూచించింది. ఈ నెలఖరులోగా ప్రీమియం కూడా చెల్లించాల్సి రావడంతో కొండాపురం మండల రైతులు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులను ఎన్నో విధాలుగా అండగా నిలిచింది. రైతులకు మెరుగైన సేవలందించేందుకు గ్రామగ్రామాన రైతు భరోసా కేంద్రాలను స్థాపించింది. విత్తనాలు ఎరువులను సరఫరా చేయడమేగాక అధిక దిగుబడులు సాధించేందుకు సూచనలు, సలహాలు ఇప్పించింది. వైఎస్సార్‌సీపీ పాలనలో ఏ సీజన్‌లో వచ్చిన పంటలను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసింది. వేసిన పంటలను ఈ క్రాప్ చేయించిన ప్రతి రైతుకు ఉచిత పంటల బీమాను అమలుచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి బీమా పొందాలంటే ప్రీమియం రైతులు చెల్లించాల్సిందేనని చెబుతున్నారు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

హామీలు అమలుచేయాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామి మేరకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయంపైనా ఇప్పటి వరకూ స్పష్టత లేదు. ఉద్యాన పంటలకు గిట్టుబాటుధర లేక అన్నదాతలు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత బీమా పథకాన్ని ఎత్తివేయడంతో రైతులకు భారంగా మారింది. పంట నష్టపోయిన వారికి న్యాయం చేయలేని పరిస్థితి.

– సీవీ.ప్రతాపరెడ్డి, రైతు, కె.రామిరెడ్డిపల్లె

ప్రభుత్వమే చెల్లించాలి



అన్నదాత సుఖీభవ కింద సాయం చేయలేదు. కనీసం ఉచిత పంటల బీమా అయినా అమలు చేయాలి. గతంలో లాగే ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించి ఆదుకోవాలి. పెట్టుబడికే డబ్బు లేక అన్నదాత ఇబ్బందిపడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం అందజేయాలి.

– ప్రవీణ్ యాదవ్, రైతు

ప్రీమియం చెల్లించిన వారికే బీమా



ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రీమియం చెల్లించిన వారికే బీమా వర్తిస్తుంది. వేరుశనగ, పత్తికి గడువు ముగిసింది. మిగిలిన పంటలకు ఈ నెలాఖరు వరకూ గడువు ఉంది. 300 మంది రైతులు ఉద్యాన పంటలకు బీమా చెల్లించారు. పూర్తి వివరాలు ఈ నెల పూర్తిగా గడిచిన తర్వాత పోర్టల్‌లో కనిపిస్తుంది. ప్రీమియం చెల్లించకపోతే పరిహారం రావడం కష్టం.

– రామాంజనేయులురెడ్డి, ఏవో, కొండాపురం

ఎంపీ చొరవతో ఎర్రబల్లె చెరువుకు నీరు



ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి(ఫైల్)

పులివెందుల రూరల్: కడప ఎంపీ అవినాష్‌రెడ్డి చొరవతో శనివారం నుంచి లింగాల కుడి కాలువ నుంచి ఎర్రబల్లె ఎత్తిపోతల పథకం ద్వారా ఎర్రబల్లె చెరువుకు నీటిని పంపింగ్ చేయడం ప్రారంభమైంది. పులివెందుల మండలంలోని ఎర్రబల్లె చెరువు, వేముల మండలం భూమయ్యగారిపల్లె చెరువు నీరులేక అడుగంటిపోయాయి. తమ పంటలు ఎండుతున్నాయని స్థానికులు కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మూడు రోజుల కిందట ఆయన ఇరిగేషన్ శాఖ అధికారులను కలిసి ఎర్రబల్లె చెరువు, భూమయ్యగారిపల్లె చెరువులకు నీరు అందించాలని కోరారు. నీరు ఇంకిపోవడంతో రైతులు బోర్లు వేయాల్సి వస్తోందని, రూ.40లక్షల వరకు ఖర్చు చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయలేదని, మరమ్మతులకు ఇచ్చామని అధికారులు ఎంపీకి తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు తాను తెప్పిస్తానని.. రైతులకు నీరందించి ఆదుకోవాలని ఎంపీ తెలిపారు. శ్రీశైలం డ్యాం, గండికోట, సీబీఆర్, పైడిపాలెం ప్రాజెక్టులలో పుష్కలంగా నీరున్నా రెండు నెలల నుంచి చెరువుకు నీరివ్వకుండా ఉన్నారని తెలిపారు. రైతులకు నీరందించకపోతే నిరసన ప్రదర్శన చేపడతామని హెచ్చరించారు. దీంతో ఎట్టకేలకు ఎర్రబల్లె చెరువుకు నీరు వదిలారు. ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డికి గ్రామస్తులు, రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భూమయ్యగారిపల్లె చెరువుకు త్వరలోనే నీటిని విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

బాబు ష్యూరిటీ – దౌర్జన్యాలు, అక్రమాలు గ్యారెంటీ



క్యూ ఆర్ కోడ్‌లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

- రాబోయే కాలంలో అంతకు అంత వడ్డీతో సహా చెల్లిస్తాం
- నార్త్‌జోన్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: చంద్రబాబు ష్యూరిటీ.. దౌర్జన్యాలు, అక్రమాలు, అన్యాయాలకు గ్యారెంటీగా మారిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం మద్రాసురోడ్డులోని ఐఎంఏ హాలులో నార్త్ జోన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన నార్త్‌జోన్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజాపక్షమేనని తెలిపారు. ఎన్నికల ముందు సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీ అప్పులు చేస్తున్నారన్నారు. వెయ్యి రూపాయలు పింఛన్ పెంచి 5లక్షల పింఛన్లు తొలగించారని ఆరోపించారు. పాలన ఎలా చేయాలో కూటమి నేతలే నేర్పిస్తున్నారని, 2.0లో అన్యాయంగా ప్రవర్తించిన నాయకులు, అధికారులకు సినిమా చూపిస్తామని హెచ్చరించారు. వారు ఎన్ని రకాలుగా వేధిస్తే అంతకు అంత వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి చట్ట పరిధిలో పనిచేయాలని సూచించారు. మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాలు సంక్షేమ పథకాలు అమలు చేశాయన్నారు. తల్లికి వందనం లోకేష్ ఆలోచనల నుంచి పుట్టిందని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు. డబ్బులు ఉన్నవారు లేనివారికి సాయం చేయాలని పీ4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, లక్షల కోట్లు ఉన్న చంద్రబాబు ఎంతమందిని దత్తత తీసుకోవాలో ప్రజలే ఆలోచించాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంపీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 మాసాలైనా ఉద్యోగ, ఉపాధ్యాయులు, నిరుద్యోగులకు చేసిందేమీ లేదన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే చుట్టూ దోపిడీదారులే – అంజద్‌బాషా

కడప ఎమ్మెల్యే మాధవి చుట్టూ ఉన్నవారంతా దొంగలు, దోపిడీదారులేనని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆరోపించారు. గత ప్రభుత్వంలో తాము మంజూరు చేయించిన నిధులకు తేదీలు మార్చి కొత్త జీవోలు తెచ్చి మేమే తెచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బుగ్గవంకపై రెండు బ్రిడ్జిలకు రూ.20కోట్లు మంజూరు చేయిస్తే ఇంతవరకూ ఆ పనులు పూర్తి చేయించలేని స్థితిలో ఎమ్మెల్యే ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కడప నగరపాలక సంస్థకు చిల్లిగవ్వ కూడా ఇవ్వకపోయినా ఎవరి సొమ్మని ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేస్తున్నారని ప్రశ్నించారు. నగర ప్రథమ పౌరుడైన మేయర్‌ను పిలవకుండా అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పేరు పెద్దగా వేయించుకుంటున్నారని మండిపడ్డారు. అనంతరం చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు.

హామీలు మరచిన చంద్రబాబు



కమలాపురం నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సమావేశంలో మాట్లాడుతున్న పీ.రవీంద్రనాథరెడ్డి

వల్లూరు: ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని మరిచిన చంద్రబాబు మోసాలను రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిద్దామని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు పీ రవీంద్రనాథరెడ్డి పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కడప పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో కమలాపురం నియోజకవర్గంలోని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్లు, పార్టీ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇవ్వడం , అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కడం చంద్రబాబుకు అలవాటైన విద్య అని విమర్శించారు. అవినీతిమయమైన బాబు పాలనతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం ఒకటేమిటి అన్ని రంగాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. 13 నెలల కాలంలోనే ప్రజలు చంద్రబాబు పాలనతో విసిగి పోయారని, ఆయన చేసిన మోసాన్ని గుర్తిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల నుండి టీడీపీ ప్రజా వ్యతిరేక పాలనపై వ్యతిరేకత వ్యక్తమవుతోందని అన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రజల తరుపున విస్తృతంగా పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తేనే మొండి ప్రభుత్వంలో చలనం వస్తుందన్నారు.

21 నుండి రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో

ఈ నెల 21 వ తేదీ నుండి కమలాపురం నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులు రెడ్డి ఆధ్వర్యంలో రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం ప్రారంభమవుతుందని రవీంద్రనాథరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా 21 వ తేదీ ఉదయం వీరపునాయునిపల్లె మండల పరిధిలోని అనిమెల సమీపంలో వున్న సంగమేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కేక్ కట్ చేస్తున్న మేనేజర్ శంకర్, సిబ్బంది

పులివెందుల: బ్యాంక్ ఆఫ్ బరోడా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పులివెందుల బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ శంకర్ తెలిపారు. పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్‌లో శనివారం ఆ బ్యాంకు వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ శంకర్ మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడాను ఫౌండర్ మహారాజా సాహేజ్ రావు గైక్వాడ్ 1939లో కలకత్తాలో రూ.10 లక్షల టర్నోవర్‌తో ప్రారంభించడం జరిగిందన్నారు. మెరుగైన సేవలతో రూ.127 లక్షల కోట్ల టర్నోవర్‌కు చేరుకుందని, ఏడాది కాలంలో పులివెందుల బ్రాంచ్ రూ.40 కోట్ల బిజినెస్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. కస్టమర్లు బరోడా బ్యాంక్ సేవలు వినియోగించుకుంటూ మన భావి తరాలకు సేవలందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఓం ప్రకాష్, సిబ్బంది శివ, లక్ష్మీవీణలతోపాటు బ్యాంకు కస్టమర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్మార్ట్ కిచెన్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, తదితరులు

తొండూరు/సింహాద్రిపురం/లింగాల: సమగ్ర మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి స్మార్ట్ కిచెన్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని అధికారులు శనివారం పరిశీలించారు. పులివెందుల నియోజకవర్గ స్పెషలాఫీసర్ రాజ్యలక్ష్మి అగడూరు, సింహాద్రిపురం జెడ్పీ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో నీటి వసతి, కూరగాయల వసతి కల్పనకు అనుకూలంగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఇనగలూరు గ్రామంలోని పాల కేంద్రాన్ని సందర్శించి పాలు, తూకం ధరలను పరిశీలించారు. అనంతరం ఆమెను డ్వాక్రా మహిళలు ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు విష్ణుప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఏపీఎంలు, సీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్య అభ్యసించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపాల్ నాయక్

వేంపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో విద్య అభ్యసించి విజయాలు సాధించాలని ఎస్ఐ తిరుపాల్ నాయక్ సూచించారు. స్థానిక పులివెందుల రోడ్డులోని ఉర్దూ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో మత్తుపదార్థాల నిర్మూలనపై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న విద్యార్థులు ఎక్కువగా విద్య పట్ల శ్రద్ధ వహించాలని, మత్తు పదార్థాల అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. చెడు వ్యసనాలపై దృష్టి పెట్టకుండా చదువుపై దృష్టి పెట్టాలని, ఆడపిల్లలు జాగ్రత్తగా ఉంటేనే భవిష్యత్తులో జీవితం సుఖంగా సాగుతుందని తెలిపారు. బాలికలు ప్రమాదంలో ఉంటే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఎస్సై తిరుపాల్ నాయక్‌తోపాటు పోలీస్‌సిబ్బంది స్టేషన్ ఆవరణంలో పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడిగా రాయలసీమకు అన్యాయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తొండూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా రాయలసీమకు అన్యాయం చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. తొండూరు సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ఒంగోలులో రాష్ట్ర మహా సభలు, సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ చండీఘర్‌లో జరిగే సీపీఐ జాతీయ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి పంట కాలువల నిర్మాణం చేపట్టాలని, ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు అందించేలా చూడాలన్నారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆయన వెంట సీపీఐ నాయకులు గాలి చంద్ర, సుబ్రహ్మణ్యం, వెంకటరములు, ఈశ్వరయ్య, అమీర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం



చెత్త తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

పులివెందుల టౌన్: ప్లాస్టిక్‌ను నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడుదామని ఆర్డీఓ చిన్నయ్య పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకం నిర్మూలనపై పులివెందుల పట్టణంలో శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొని ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ చిన్నయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ పర్యావరణాన్ని కాలుష్యం చేయడమేగాక, ప్రజలు అనారోగ్యం పాలవడానికి దారి తీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ కో.ఆర్డినేటర్స్ శ్రీనిత, శ్రీనివాస్ రెడ్డి, రమీజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో: పట్టణంలోని స్థానిక ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో విద్యార్థులకు ×ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జయమ్మ ప్లాస్టిక్ వినియోగంతో వచ్చే అనర్థాలు, రోగాలు వివరించారు. అనంతరం కళాశాల వెనుక భాగంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని వారు తొలగించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు: పట్టణం, మండల పరిధిలో ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకుందామని ఎంపీడీఓ వెంకటరమణయ్య పేర్కొన్నారు. మండలంలోని చిలంకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలపై ప్రజల్లో చైతన్యం రావాలన్నారు.

వేంపల్లె: ప్లాస్టిక్ వాడకంతో ఎన్నో అనర్థాలు జరుగుతాయని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.తిరుపతి రెడ్డి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ ప్రోగ్రాంలో భాగంగా ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లోని ఎన్ఎస్ఎస్ యూనిట్-14 ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వస్తువుల ఏరివేత, క్లీనింగ్ ప్రక్రియ శనివారం చేపట్టారు. అనంతరం క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హాకీ గ్రౌండ్‌లో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వస్తువులను తీసివేసి పరిశుభ్రం చేశారు. అనంతరం ప్లాస్టిక్ వస్తువులు వాడటంవలన కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దీప్తి, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రమైన లింగాలలో శనివారం స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని కోరారు. భోజనం చేసేముందు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించాలని సూచించారు. అనంతరం లింగాల హైస్కూల్ నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీగా వచ్చి బస్టాండులో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి, ఎంఈఓ రామకృష్ణయ్య, హెచ్ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె: స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా చింతకొమ్మదిన్నె గ్రామంలో శనివారం ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహనా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వ్యాపార షాపుల యజమానులకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం గురించి అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో టివి. సుబ్బారెడ్డి, సర్పంచ్ కందిమహేశ్వరి, రామాంజనేయులు, ఈశ్వరరెడ్డి, ప్రేమలత పాల్గొన్నారు.

రెడ్లపై కూటమి నాయకుల కక్ష సాధింపు



మాట్లాడుతున్న ఆర్‌సీడీఎస్ నాయకులు

పులివెందుల టౌన్: రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని పరుష పదజాలంతో దూషిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆర్‌సీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు సర్వోత్తమ్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందులలో విలేకరులతో శనివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 13 నెలలుడచినా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేయకపోగా, రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వారి మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడుతున్న వికృత చేష్టలను సహించేది లేదన్నారు. నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ విచక్షణ కోల్పోయి మాజీ మంత్రి రోజాను సంబోధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తే కేసులతో, ఇండ్ల మీద దాడి చేస్తూ ఏ ఒక్క రెడ్డి నాయకుడిని ఉంచకూడదనే ధోరణిలో ఉన్నారన్నారు. ఇపుడు మీరు ఏదైతే చేస్తున్నారో, ఈ సంస్కృతిని రాష్ట్రంలో అవలంభిస్తున్నారో, అదే సంస్కృతిని రేపు పాలకుడైన వారు మీ మీద ప్రయోగిస్తే మీ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వెంగల్ రెడ్డి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.